బక్కవ్వ. శోభ 'ఊ' కొడుతూనే ఉంది. దిగులుతో మౌనంగా వారివెంట బయల్దేరాడు భూమలింగం.

మూడు తొవ్వలు, గాంధి దగ్గర వేపచెట్టుకింద ఆగారు అందరు. దుమ్ముపట్టిన దప్పును తుడిచి కొట్టడం మొదలెట్టాడు భూమలింగం. మనుమలతో వస్తువుల దగ్గర కూర్చుని అడిగిందల్లా శోభకు అందిస్తుంది బక్కవ్వ. జనం గుమికూడారు. ముందుగా కోతితో చిన్న చిన్న పీట్లు చేయించాడు భూమలింగం.

కొన్ని డిల్లేకి మాటల తర్వాత లేచింది శోభ. అప్పటికే మోకాళ్ల వరకు గోచీపోసి కొంగునడుముకు చుట్టింది. నాటకపక్కీలో "నాయినా... ఇది సలువగల్లూరు. దొరలున్న ఊరు. దాతలున్నఊరు. మారాజులున్న ఊరు. వట్టి కోతి ఆట చూపిచ్చి జారుకుందామనుకుంటున్నవా! ఒక్కటంటే ఒక్కటే ... మీ తాతలు నేర్పింది, ఈ దాతలు మెచ్చింది ఎవరూ చేయలేనిది, ఒకపీటు చెయ్యి. దొరలు మెచ్చి నీ కడుపుకు తిండి పెడ్తారు. కట్టుకోను బట్టలిస్తారు. అంతేగని ఈ కోతిపీట్లు చూపించకు'' అంటూ లయబద్ధంగా అడుగేసింది.

భూమలింగం లేచాడు. కోతిని బక్కవ్వకిచ్చి ఇనుప సలాకను అందుకున్నాడు. "అవును బిడ్డా! మరి అలాంటివి చూపిస్తా. ఏ పైల్వాను చెయ్యని పని, మూతి మీద మీసమున్న ఏ మొగోడు చెయ్యని పని జేత్త. ఈ దొరలు.... ఈ మారాజులు.... నా కడుపు జూత్తరంటవా! నా ఆకలి జూత్తరంటవా.. బట్టపొట్టకు నడుపుతరంటవా! అన్నాడు అదే యాసతో...

"నువ్వు జేసి చూపరాదు నాయినా.. అందరు కనిపెంచిన మారాజులే! వాళ్లకే కడుపుల దయపుడుతది.'' అన్నది శోభ చేతులు ఊపుతూ,

ఇనుప సలాకను తీసి ఒక యువకుడిని పిలిచి రెండు చేతులతో వంచుమన్నాడు. అతడు అతికష్టం మీద కొద్దిగా వంచి తన వల్లకాదన్నాడు. సలాకను కూతురుకిచ్చి "తల్లులారా... తండ్రులారా ఈ ఇనుప కడ్డీని ఇతడు చేతులతో కూడా వంచలేదు. ఒక ఆడకూతురు గొంతుతో వంచి చూపిస్తుంది చూడు" అన్నాడు. నాటక పక్కీలో.

భూమలింగం డప్పును వాయిస్తున్నాడు. మధ్య మధ్య నవ్వు వచ్చే విధంగా మాట్లాడుతున్నడు. బక్కవ్వ భయం భయంగా కూతురును చూస్తుంది. శోభ జనం వైపు ఒకసారి కలియజూసింది. ఆట ఆడుమని చెప్పిన వ్యక్తి కొరకు ఆమె కళ్లు వెదికాయి. అతడు కనిపించలేదు. కళ్లల్లో ఏదో దిగులు చోటు చేసుకుంది. సలాకను అందుకుని అటూ ఇటూ తిప్పి ఒక చివరను నేలకు ఆనించి రెండవ చివరను గొంతుకు ఆనించుకుంది. డప్పు లయబద్ధంగా మోగుతుంది. బరువునంతా సలాకపై ఆనించి ఏటవాలుగా నిలబడి చేతుల్ని వెనక్కి కట్టుకుని బలంగా నొక్కుతుంది.

"అన్నలారా... తమ్ములారా... మీ గొంతును తడుముకొండి తమలపాకు కంటే పలుచగుంటది. చిన్న ముల్లు గుచ్చితే రక్తమెల్లుతది. గట్టిగా నొక్కితే ఊపిరాడది. అసొంటిది ఇనుప కడ్డీని వంచుడంటే ఎంత కష్టమో సూడుండ్రి. దయగల్ల మారాజులు దానం జెయ్యండ్రి'' డప్పు కొడుతూ అన్నాడు భూమలింగం. చారాన ఆటాన తప్ప చిల్లర రాలటం లేదు. రాలిన నాణాలను పిల్లలు పరుగున వెళ్లి అందుకుని బక్కవ్వకిస్తున్నారు.

ఆయాసంతో ఊపిరిపీలుస్తూ సలాకను నొక్కుతున్న కూతురును చూస్తూ ఆమె కష్టానికి ఫలితంగా వినోదంగా విసిరిన చిల్లరను అపురూపంగా అందుకుంటుంది బక్కవ్వ. కూతురువైపు

భయంగా అందరివైపు ఆశగా ఆమె చూపులు తిరుగుతున్నాయి. ఎక్కడ పట్టుతప్పి పడిపోతదో అన్న ఉత్సుకతని అందరికీ కలుగజేస్తూ సలాకను వంచింది శోభ. అందరూ ఆనందంగా చప్పట్లు చరిచారు.

మరికొన్ని ఫీట్లు చకచకా చేసింది శోభ. తేపతేపకు ఆమె మందినంతా కలియజూస్తుంది. ఆమె చూపులు మనిషి మనిషినీ తడుముతున్నాయి. మొహంలో బెరుకుతనం చోటుచేసుకుంది. ఇక ఆట చాలిద్దామన్నాడు భూమలింగం. డబ్బు వైపు చూసి పెదవి విరిచింది శోభ.

"నాయినా... కనీసం వంద రూపాయలైనా వస్తాయనుకున్నం. ఐదు రూపాయలైనా రాలేదు. అంటే మనం చేసే ఫీట్లు వాళ్లను కరిగిస్తలేవన్నట్టే గదా! కరిగిస్తే పైసలు రాలేవి. మనం ఫీటు చేస్తుంటే వాళ్లకు గోస అనిపియ్యాలె. మనం గట్ల యాక్షన్ జెయ్యాలె." అంటూ రింగ్ అందుకుంది. తల మాత్రమే పట్టేంత చిన్నగా ఉన్నది అది. బక్కవ్వ కూతురువైపు భయంగా చూసింది. చకచకా రింగును మెడకు వేసుకుని చేతుల్ని పైకి తీసింది శోభ. అంత చిన్న రింగ్‌లోంచి ఎలా ఈగుతుందోనని ఊపిరి బిగపట్టి చూస్తున్నారు జనం. భూమలింగం డప్పు మోగిస్తూ రింగ్ ఎంత చిన్నదో దాంట్లోంచి ఈగడం ఎంత కష్టమో చెబుతున్నాడు. బక్కవ్వ చూపులు రింగ్ వెంట కదులుతున్నాయి. ఆయాసంతో అంగులం అంగులం రింగ్‌ను కిందికి జారుస్తుంది శోభ. అప్పుడే జనంలో కలకలం వినిపించింది.

"నక్సలైట్లు ఊళ్లోకి వచ్చారట" ఎవరో అన్నారు.

"ఇంకేం.. ఈ విషయం తెలిస్తే పోలీసులొత్తారు" మరొకరన్నారు.

చూస్తుండగానే చీమల్లా జనం మాయమయ్యారు. శోభ అసహాయంగా చూసింది. కనీసం కొంత సొమ్మయినా రాలుతుందనుకున్న ఆమె ఆశ నిరాశయింది. ఏది ఏమైనా ఆ ఫీటు తప్పినందుకు బక్కవ్వ మనసు కుదుటపడింది. చిల్లర డబ్బుల్ని చూస్తు నిర్వేదంగా ఉండి పోయాడు భూమలింగం. చేతికందిన నాణాన్ని తీసికుని పిల్లలు దుకాణం వైపు పరుగుతీసారు.

వస్తువులన్నింటినీ సర్దుమని చెప్పి దొర ఇంటివైపు నడిచింది శోభ. గేటుకు తాళం కనిపించింది. అక్కడ కనిపించిన ఒకరిద్దరిని దొర ఎక్కిడికి వెళ్ళారని అడిగింది. ఆమెవైపు వింతగా చూస్తు తమలో తాము నవ్వుకుంటూ సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు. కొందరు ఆమె వైపు అనుమానంగా, భయంగా చూసారు.

అంతా అర్థమయ్యేసరికి శోభకు కళ్లల్లో నీళ్లుతిరిగాయి. తుడుచుకుంటూ వచ్చిన దారి పట్టింది. అమె కొరకే ఎదురుచూస్తున్న తల్లికి తండ్రికీ కళ తప్పిన శోభ మొహం చూసాక 'డబ్బు ఇచ్చాడా' అని అడగాలనిపించలేదు.

నీరసంగా కూలబడిపోయింది శోభ. ఆకలి గుర్తుకురాగానే సత్తుగిన్నెను అందుకుంది బక్కవ్వ. సల్లిపట్టీల పంపకంలో పిల్లలు ముగ్గురు కొట్లాడుకుంటున్నారు. కూతురు చేసిన పీట్లు గుర్తొచ్చి భూమలింగం కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"వాళ్లు అంతే బిడ్డా! ఈ పటేండ్లు దొరలు కొంపల గుత్తోల్లు. నా చిన్నప్పుడు ఈ ఊర్లెకు వచ్చినప్పుడు గిట్లనే అయింది. ఆట ఆడేదాక ఇత్తనన్నడు. ఆడినంక పోలీసు పటేలంటే మాలీ పటేల్ మాలీ పటేలంటే సర్పంచ్ ఎవల్నడిగినా ఇయ్యలేదు. రెండు మూడుసార్లడిగితే ఊర్లె

ఉండబుద్దయితుందా లేదురా! అని బెదిరిచ్చింద్రు. ఇప్పుడేం ముల్లెగట్టుకున్నరు. వాళ్లు ఊర్లెకెళ్లి పోయింద్రంటేనే భయం లేకుంటయింది. ఒకసారి షికారి బోయి కుందేలును పట్టుకచ్చిన. అది పోలీసు పటేలు కంట్లపడ్డది. అంతే! కోసి పాతం జేసినంక మాంసాన్ని బెదిరిచ్చి తీసుకపోయిండు''. అంటూ లేచి గాలం బరిగెను, సంచిని, వలను అందుకుని వాగువైపు నడిచాడు.

ఊరు తన ఆకలి తీర్చకపోయినా వాగు తన ఆకలి తీరుస్తుందని అతడి గట్టి నమ్మకం. తుంగలో నాలుగుపుల్లకోళ్లు, గువ్వలు, మడుగులో చేపలు దొరుకుతాయనుకున్నాడు. తాతను చూసి ముగ్గురు మనవలు వెంట పడ్డారు. చిన్న కొడుకును దగ్గరకు లాక్కుంది శోభ. మిగిలిన ఇద్దరు చేతికి దొరక్కుండా వాగువైపు పరుగుతీసారు.

ఎండ చుర్రుమంటుంది. మనవలు తెచ్చిన ఎరల్ని గాలానికి గుచ్చి ఒక మడుగులో వేసి పుల్లకోళ్ల వేటలో పడ్డారు. పొద్దు నడీనెత్తి మీదికి వచ్చేసరికి అతడి ప్రయత్నం ఫలించింది.ఆరు పుల్లకోళ్లు ఒక గుడ్డికొంగ నాలుగు కొర్రమొట్టలు, రెండు గండ వరుకలతో రోడ్డునెక్కాడు భూమలింగం.

ఆహారం దొరికాక ఆకలి మరింత ఎక్కువయింది. వడివడిగా అడుగులేస్తున్నాడు. ఊరివైపు నుండి వేగంగా దూసుకొస్తున్న జీపు అతడి మీద దుమ్మును నింపుతూ పక్కనే ఆగింది.

నలుగురు కానిస్టేబుళ్లు తప్ప ఎస్.ఐ. లేడు. ఇద్దరు కానిస్టేబుళ్లు కిందికి దిగారు. మూరెడు మూరెడు పొడువుండి ఈతకమ్మకు వేళాడుతున్న కొర్రమొట్టలపైనే ఉన్నాయి వాళ్ల చూపులు.

"అరేయ్.... ఏ ఊరురా నీది...?'' గద్దించారు.

"బాంచెను కల్మోక్త. తంగెలపెల్లి... చేపల్ని పిట్టల్ని మలిచిపట్టుకుంటూ అన్నాడు భూమలింగం.

"ఒరేయ్.... వన్యప్రాణుల్ని చంపద్దు. అలా చేస్తే నేరం. అది నీకు తెలుసునారా?..'' ఏదేదో అరుస్తున్నాడు కానిస్టేబుల్. మరొకరు భూమలింగంను జీపులోకి తోసారు. కాళ్లు మొక్కి బతిమాలి బయటపడ్డాడు. అతడి చేతుల్లో చేపలు పిట్టలు లేవు. కడుపులో ఆకలి మాత్రం ఉంది. భయంతో పిల్లలిద్దరూ వెళ్లి తల్లికి చెప్పినట్టున్నారు. శోభ పరుగెత్తుకుని వస్తుంది. జీపు దుమ్మును లేపుకుంటూ మాయమయింది.

ఇరవై ఏళ్ల కింద కుందేలు కూరను పట్టుకెళ్లిన దొర గుర్తొచ్చి "అప్పుడే నయం. బతిలాడి కాళ్లు మొక్కితే కుందేలు కాళ్లు తలకాయలన్న ఇడిసిపెట్టిండు'' అనుకున్నాడు ●